



దినపత్రిక తిరగేస్తుండగా 'వధువు కావలెను' అన్న ప్రకటనపై పడ్డాయి వైదేహి చూపులు. ఆ ప్రకటన రెండు మూడు సార్లయినా చదివుంటుంది వైదేహి. అర్హతలన్నీ సరిపోయాయి.

అయితే ఆరేళ్ళ కొడుకు బాలు గురించే ఆమె ఆలోచన. కొడుకు పుట్టగానే ఆశ్రమంలో చేర్పించింది. బాలు తన కొడుకన్న విషయం ఆశ్రమం మేనేజర్ శివరామయ్యకు తప్ప మరో మనిషికి తెలియదు. వితంతువైనా పర్వాలేదని ప్రకటనలో వుంది. కాని పిల్లల గురించి రాయలేదు. అందుకే తను పంపబోయే వివరాలతో బాలు విషయం రాయకుండా ఉండటమే మంచిది అనుకుంది వైదేహి.

ఆలోచనల్లోపడి టైమ్ సంగతి మరచిపోయింది. గడియారం తొమ్మిది చూపుతోంది. పదిగంటలకు నాంపల్లిలో ఉన్న తారా ట్రావెల్ ఏజన్సీ ఆఫీసుకు చేరుకోవాలి. న్యూస్ పేపర్ని టీపాయ్ మీద పడేసి బాత్‌రూమ్ వైపు పరుగెత్తింది వైదేహి.

సుధాకర్, వైదేహి మేనత్త మేనమామ పిల్లలు. చిన్నప్పటినుంచి వారిద్దరు ఒకే దగ్గర పెరిగారు. ఒకే కాలేజీలో చదువుకున్నారు. ఆ యిద్దరు ఎక్కడ కనిపించినా 'కాబోయే దంపతులు ఎక్కడ నుంచి వస్తున్నారు?'- అని ఆ ఊళ్ళో వారు ప్రశ్నించేవారు. వారి మాటలు సుధాకర్‌కి ఆనందాన్నిచ్చినా వైదేహి మాత్రం వాటిని లెక్కలోకి తీసుకునేది కాదు. టీనేజ్‌లో అడుగుపెట్టిన వైదేహి అల్లరి గడుగ్గాయిగా తయారైంది. బి.ఏ. మొదటి సంవత్సరం ఆమె చదువుతున్నప్పుడు డిగ్రీ ఫైనలియర్ చదివేవాడు సుధాకర్.


టైమ్ తొమ్మిదిన్నర. హేండ్ బాగ్ పుచ్చుకుని హడావిడిగా బస్‌స్టాప్ వైపు పరుగెత్తింది వైదేహి. ఆమె ధ్యాస పేపర్లో చూసిన ప్రకటన మీదే ఉంది. వైదేహి హైదరాబాద్ వచ్చి ఏడేళ్ళు గడిచాయి. కాని ఆమె ఎప్పుడూ పెళ్ళి గురించి ఆలోచించలేదు. ఇప్పుడిప్పుడే ఆమె మనసు పెళ్ళి వైపు మళ్ళుతోంది. అర్ధరాత్రి నిర్భయంగా ఆడది నడిరోడ్డు మీద నడవగలిగిన నాడే మనకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు అని గాంధీజీ అన్నారు. ఆ దృష్టితో చూస్తే ఇంకా మనం ఎంతో వెనుకబడి ఉన్నాము.

అర్ధరాత్రి కాదు - పట్టపగలు ఒంటరిగా ఆడది నడిరోడ్డుమీద నడవటానికి ధైర్యం చాలని యీ రోజులను తలచుకుంటే, మహాత్ముడు కలలుగన్న ఆ స్వాతంత్ర్యానికి మనం యింకా చాలా దూరాన ఉన్నాం అన్న అభిప్రాయం ఏర్పడుతుంది. వైదేహి ఒక బిడ్డకు జన్మనిచ్చిన తల్లి. అటువంటి కన్నతల్లుల వెంబడి రౌడీమూక కేకలు వేస్తూ పిచ్చి చేష్టలు చేస్తుంటే యిక టీనేజ్‌లో ఉన్న కాలేజి అమ్మాయిల మాటేమిటి? తనకో తోడు కావాలన్న ఉద్దేశంతో కాకపోయినా తన కొడుకు బాలు కోరిక తీర్చడం కోసం అయినా తను మళ్ళీ పెళ్ళి చేసుకోక తప్పదన్న నిర్ణయానికి వచ్చింది వైదేహి. అందుకే పేపర్లో పడిన ప్రకటనకు సమాధానం యివ్వాలని ఆమె తీర్మానించుకుంది. అనుకున్నట్టే ఉత్తరం రాసి పోస్టు చేసింది. తనకు ఆరేళ్ళ కొడుకు ఉన్నట్టు తెలియపర్చలేదు. పోస్ట్‌బాక్స్‌లో ఉత్తరం వేసిన తర్వాత ఆమె మస్తిష్కంలోని ఆలోచనలు సముద్రంలోని కెరటాల్లా చెలరేగసాగాయి. అతని వయస్సెంత? అతనికిది మొదటి పెళ్ళా? లేక రెండో పెళ్ళా??..." అలా ఆలోచిస్తూ ఆ రాత్రి పన్నెండు గంటల వరకు నిద్రపోలేదు వైదేహి.

★ ★ ★

ఏడేళ్ళ క్రిందట వైదేహితో నిశ్చయమైంది సుధాకర్ పెళ్ళి. అయితే పెళ్ళి ఘడియలకు కొన్ని క్షణాల ముందు ఊరు విడిచి వైదేహి ఎవరితోనో లేచిపోయిన కారణంగా ఆ పెళ్ళి జరగలేదు. అందువలన సుధాకర్ అమెరికా వెళ్ళిపోయాడు. నాలుగేళ్ళు అమెరికాలో ఉద్యోగం చేసి లక్షల డాలర్లు సంపాదించాడు. అమెరికా వెళ్ళిన తర్వాత రెండేళ్ళు పెళ్ళి చేసుకోవాలన్న కోరిక అతనికి కలుగలేదు. ఆఫీసులో పనిచేసే స్వప్నతో అతనికి పరిచయం ఏర్పడిన తర్వాత సుధాకర్ మనసు మారింది. వైదేహిని తప్ప మరొకరిని వివాహం చేసుకోను అన్న నిర్ణయానికి అతను కట్టుబడి ఉండలేకపోయాడు. స్వప్నను పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళి చేసుకున్న ఆరునెలలు తిరగకముందే ఆమె అసలు రంగు బయటపడింది. తన డబ్బు కోసమే ఆమె నాటకం ఆడిందని గ్రహించాడు. స్వప్నకు విడాకులిచ్చి తలభారాన్ని వదిలించుకున్నాడు. ఆ తర్వాత అక్కడ జీవితం సాగించటానికి మనస్కరించక అతను అమెరికా విడిచి ఇండియా చేరుకున్నాడు.

అమెరికా నుంచి ఇండియా వచ్చిన సుధాకర్ హైద్రాబాద్‌లో సెటిలయ్యాడు. అదే ఊర్లో తన క్లాస్‌మేట్ గోపాల్ బిజినెస్ చేస్తున్నాడు. శలవు



ఆంధ్రప్రచురణ ప్రయివేట్ లిమిటెడ్ కార్యాలయంలో జరిగిన పూజలో పాల్గొని 'ప్రియదత్త' ప్రారంభ సంచిక (28.03.2001) తొలి కాపీని అందుకుంటున్న రాజ్య సభ మాజీ సభ్యులు డాక్టర్ యలమంచిలి శివాజీ.

దినాల్లో ఎక్కడో ఒక దగ్గర ఆ యిద్దరు మిత్రులు కలుసుకుంటూ ఉంటారు. 'వయసు మించిపోలేదు కదా, నువ్వెందుకు పెళ్ళిచేసుకోకూడదు సుధాకర్' - అన్నాడు గోపాల్ ఒకరోజు.

వైదేహితో జరగాల్సిన పెళ్ళి కేన్సిల్ అయిన విషయం, ఆ తర్వాత అమెరికాలో స్వప్నచేత తనెలా మోసగింపబడినది సుధాకర్ గోపాల్‌కు మరోసారి చెప్పి ఆ చేదు అనుభవాలు చవిచూసిన తనను మళ్ళీ పెళ్ళి చేసుకోమని బలవంతం చెయ్యొద్దని బ్రతిమాలాడు.

"చూడు సుధాకర్! రోజులు బాగాలేనప్పుడు తాడే పామై కరుస్తుందట. ఎప్పుడో ఏదో జరిగిందని జీవితాంతం విరక్తి చెందుతూ కూర్చోడం వివేకం అనిపించుకోదు. అందుకే నా సలహాను పాటించి నువ్వు పెళ్ళికి ఒప్పుకుంటావన్న విశ్వాసం నాకుంది.. 'వధువు కావలెను' అన్న ప్రకటన రేపు పేపర్లో వస్తుంది, చదువుకో.' అని తన బాగ్ పట్టుకుని బయటకు నడిచాడు గోపాల్.

"మమ్మీ, రేపు మా స్కూలు వార్షికోత్సవం. పిల్లలు తప్పక స్కూలుకు హాజరు కావాలి. మమ్మీ, డాడీలను తప్పక తీసుకు రావాలని చెప్పింది టీచరు... డాడీ ఎక్కడున్నారంటె ఎప్పుడూ చెప్పవేంటి మమ్మీ-" అన్నాడు బాలు, ఆరోజు ఆఫీసు విడిచి పెట్టగానే ఆశ్రమానికెళ్ళిన వైదేహిని చూసి.

బాగ్‌లో ఉన్న ఒక చాక్‌లెట్‌ను తీసి బాలు చేతిలో పెట్టింది వైదేహి. చాక్‌లెట్ని చూశాక తనడిగిన విషయం మరచిపోయాడు బాలు. కొడుకు కోసమైనా తను మళ్ళీ పెళ్ళి చేసుకోక తప్పదనుకుంది వైదేహి, చాక్లెట్ తింటూన్న బాలుని దగ్గరకు తీసుకుని.

★ ★ ★

పేపర్లో వేయించిన ప్రకటనకు బదులుగా వచ్చిన నాలుగైదు ఉత్తరాల్ని సుధాకర్ చేతిలో పెట్టాడు గోపాల్. కవరు మీద ఉన్న దస్తూరిని బట్టి ఒకటి వైదేహి నుంచి వచ్చిన ఉత్తరం అని యిట్టే గ్రహించాడు సుధాకర్. ఆ ఉత్తరం చదివాక సుధాకర్ మనసులో అంతవరకు వైదేహి మీదున్న కోపం మంచులా కరగిపోయింది.

వైదేహి తన కాలేజ్‌మేట్ రాజేంద్ర చేత మోసగింపబడి ఆరోజు పెళ్ళి విడిది నుంచి తప్పించుకు పారిపోయినట్టు సుధాకర్ అమెరికాలో ఉండగా తండ్రి రాసిన ఉత్తరాల వలన తెలుసుకున్నాడు. నగలతోను, డబ్బుతోను తనవెంట వచ్చిన వైదేహిని కొన్ని నెలలు ఎటువంటి యిబ్బంది పెట్టకుండా చూసుకున్నాడు రాజేంద్ర. ఆ తర్వాత అతను వ్యసనాలకు దాసుడై వైదేహిని సరిగా చూసుకోలేదు. వైదేహి తెచ్చిన డబ్బు, నగలు హారతి కర్పూరంలా హరించుకుపోయాయి. ఒక రాత్రి తప్పతాగి టాంక్‌బండ్ మీద నుండి వస్తున్నప్పుడు రాజేంద్ర స్కూటర్, ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. అక్కడి కక్కడే రాజేంద్ర ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. భర్త

చనిపోయేసరికి వైదేహి మూడు నెలల గర్భిణి. అప్పటికే ఆమె తల్లిదండ్రులు యీలోకం విడిచి వెళ్ళిపోవడంతో వైదేహి మళ్ళీ కన్నవారి ఊరు వెళ్ళలేదు. హైద్రాబాద్‌లో ఒక చిన్న ఉద్యోగం చూసుకుంది. రాజేంద్ర చనిపోయిన ఆరు నెలలకు ఆమెకు మగబిడ్డ కలగటంతో ఆ బాబుకు బాలు అన్నపేరు పెట్టి శివరామయ్య ఆశ్రమంలో చేర్పించింది.

'వధువు కావలెను' అన్న ప్రకటన చూసి రాసిన ఉత్తరానికి వచ్చిన జాబు అందుకుని బయల్దేరింది వైదేహి. ఆ యిల్లు చేరుకోగానే సుధాకర్ మిత్రుడు గోపాల్ ఆమెను సాదరంగా ఆహ్వానించి ఇంటర్వ్యూ గదిలోకి తీసుకెళ్ళాడు.

"మిమ్మల్ని పెళ్ళి చేసుకోవటానికి నా స్నేహితుడు యిష్టపడ్డాడు.' చెప్పాడు గోపాల్. వైదేహి ఆశ్చర్యంగా అతని ముఖంలోకి చూసింది.

"మిమ్మల్ని చూడకుండా వరుడు ఎలా యిష్టపడ్డాడన్న సందేహం మీకు కలగటం న్యాయమే. కాని నేను చెప్పింది అక్షరాల నిజం. మరి మీరేమంటారు?'

గోపాల్ వేసిన ప్రశ్నకు సమాధానం యివ్వలేదు వైదేహి.

'అది కాదు మేడమ్, వరుడ్ని చూశాక మీరు 'నో' అంటే అతను బాధపడొచ్చు. అతను యిప్పటికే జీవితంలో దెబ్బ తిన్నాడు మీలాగ-' చెప్పాడు గోపాల్.

'నాలాగా!.... నా కథ యింకా నే వినిపించలేదే..." అంది వైదేహి.

"అఫ్‌కోర్స్ - మీరు చెప్పలేదు. కాని మాకు పంపిన వివరాల్లో విడో అని పేర్కొన్నారు కదా...! అందుకే అలా అన్నాను." అన్నాడు గోపాల్ కొంచెం తడబడుతూ.

"చూడండి, ముఖ్యంగా పెళ్ళి చేసుకోవాలని నేను ముందుకు రావటానికి కారణం - నాకో తోడు కావాలని."

"అంతే కదా! మీకు మరేమి రిజర్వేషన్స్ లేవు కదా..."

"లేవు"

"అంటే - వ్యక్తి మంచివాడైతే పెళ్ళి చేసుకోటానికి మీకు ఎటువంటి అభ్యంతరం ఉండదనుకుంటాను- అవునా?"

"అవును".

అదే సమయాన కర్టెన్ తొలగించుకుని పక్కగదినుండి హాల్లోకి వచ్చిన సుధాకర్ని చూసి కొన్ని క్షణాలు అవాక్కయిపోయింది వైదేహి. ఆ టైములో సుధాకర్ని అక్కడ చూస్తానని ఆమె అనుకోలేదు. అది కలా, నిజమా అన్న సందేహం ఆమెను కొన్ని క్షణాలు కలవరపెట్టింది.

"మేడమ్, పేపర్లో ప్రకటనిచ్చిన వరుడు యితనే - మిస్టర్ సుధాకర్... నేను పరిచయం చేయనక్కర్లేదనుకుంటాను."

గోపాల్ చెప్పగానే కుర్చీలో కూర్చున్న వైదేహి లేచి సుధాకర్ కాళ్ళమీద పడిపోయింది. దుఃఖాన్ని ఆపుకోలేక భోరున ఏడ్చింది.

వైదేహిని చూడగానే సుధాకర్ మనసు ఆనందంతో ఉప్పొంగిపోయింది. రెండు చేతులతో వైదేహిని పైకి తీసి, ఆమె చెక్కిళ్ళపై రాలిన కన్నీటి బిందువులను తుడిచాడు.

"అదృష్టం మీ యిద్దర్ని ఒక దగ్గరకు చేర్చింది. తోడు కోసమే జీవిత భాగస్వామిని చూసుకోవాలని మీ యిద్దరు కోరుకున్నారు. కాకతాళీయంగా ఇద్దరూ ఒకే చోట కలిసారు." అన్నాడు గోపాల్, సుధాకర్, వైదేహి చేతులు కలుపుతూ. ఆ మర్నాడే ఆ యిద్దరి పెళ్ళి ఒక గుడిలో పెద్దల సమక్షంలో జరిపించాడు గోపాల్.

కాలచక్రంలో రెండేళ్ళు యిట్టే దొర్లిపోయాయి. తనొక తండ్రిని కావాలన్న కోరిక కలిగింది సుధాకర్‌కి. అయితే ఆ అదృష్టం అతనికి లేదు. ఎంతోమంది డాక్టర్లను అతను సంప్రదించాడు. పిల్లలు కలగకపోవటానికి కారణం తన శారీరక లోపం అని చెప్పారు డాక్టర్లు.

పెద్ద బంగళా, రెండు ఏ.సీ. కార్లు, నలుగురు నౌకర్లు-దేనికి లోటు లేదు వైదేహికి. పెళ్ళి తప్పించుకుని ఊరువిడిచి రాజేంద్ర వెంట వెళ్ళిన వైదేహి ఎన్నో కష్టాలను అనుభవించింది. ఆ కష్టాలు గట్టెక్కాయి. ఇప్పుడామె ఎంతో సుఖంగా ఉంది. అయితే ఎవరికీ చెప్పుకోలేని దిగులు ఆమె మనసును పీడిస్తోంది. ఎన్నో సుఖాలు అనుభవిస్తున్నా పుట్టక ముందే తండ్రిని పోగొట్టుకున్న తన కొడుకు బాలు, కన్నతల్లికి దూరమై ఆశ్రమంలో జీవిస్తున్నాడన్న బాధ ఆమెను సుఖంగా బ్రతకనివ్వటం లేదు. తన కొడుకు కోసమే తను మళ్ళీ పెళ్ళి చేసుకుంది. ఇప్పుడా కొడుకు తన కళ్ళముందు తిరగటానికి నోచుకోకపోతే తనకీ ఆస్తి, ఐశ్వర్యాలెందుకు? ఒక బాబుని దత్తత తీసుకోబోతున్నట్టు సుధాకర్ తెలియపర్చడంతో వైదేహి బ్రతుకు గోరుచుట్టుపై రోకటి పోటైంది.

★ ★ ★

ఆశ్రమ హైస్కూల్ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆ సంస్థ డైరెక్టర్ గోపాల్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడం జరిగింది. ఆ రోజు ఆదివారం. వైదేహి యింట్లో లేదు. గోపాల్ తనతోపాటు సుధాకర్‌ను స్కూలు వార్షికోత్సవాలకు తీసుకెళ్ళాడు. అక్కడ బాలబాలికలు ప్రదర్శించిన వినోద కార్యక్రమాలను చూసి అంతా ఆనందించారు. ఆ ఉదయం జరిగిన పోటీలలో గెలుపొందిన పిల్లలకు సుధాకర్ చేత బహుమతులను యిప్పించడం జరిగింది. ఎక్కువ బహుమతులను అందుకున్న బాలుని చూసి అంతా మెచ్చుకున్నారు.

బాలు బహుమతులను అందుకుంటుంటే స్వయంగా చూడాలన్న కోరికతో ఆశ్రమ స్కూలుకు వచ్చిన వైదేహి, అక్కడ సుధాకర్ని చూసి దిగ్భ్రమ చెందింది. ఆ ప్రోగ్రామ్‌కి సుధాకర్ వస్తాడని ఆమె ఊహించలేదు.

"నువ్వీ ప్రోగ్రామ్‌కు వస్తావని నాకు తెలుసు, అందుకే నేను వచ్చాను' నవ్వుతూ అన్నాడు సుధాకర్ హాలు నుండి బయటకు వస్తున్న వైదేహిని చూసి.

## ఆకాశ గంగ!



మన విమాన దళంలోని స్కై డైవింగ్ టీమ్ వారు 'ఆకాశ గంగ' పేరిట అంబర వీధిలో విమానాల ప్రదర్శన దినోత్సవంనాడు, గాలిలో అత్యంత సాహసంతో, బహుకనువిందైన విన్యాసాలు ప్రదర్శించారు. వారి ఇదివరలో అతి పెద్దదైన, పొడవైన మన జాతీయ పతాకాన్ని పట్టుకొని ఆకాశం నుంచి క్రిందకుదూకి ఓ చరిత్ర సృష్టించారు. 37 దేశాలనుంచి వచ్చిన ఎందరో విమానయోధులు 5 రోజులపాటు జరిగిన ఈ ఉత్సవాల్లో పాల్గొని అందరికీ నయనానందం కలిగించారు.

"మీరెలా ఊహించారు? నేను రావాలని అనుకోలేదు - పిల్లల....."

"నువ్వలా కంగారు పడాల్సిన పనిలేదు. నీకు పిల్లలంటే చాలా యిష్టం, అందుకే నేనలా అన్నాను." సుధాకర్ నవ్వాడు.

బాలు గురించి అతనికేమి తెలియలేదు కదా అన్న సంతోషంతో గట్టిగా శ్వాస తీసింది వైదేహి.

"మీరు చెప్పింది కరెక్టు. ఇక్కడ ఆశ్రమ మేనేజర్ నాకు బాగా తెలుసు. పిల్లల ప్రోగ్రామ్స్ ఉన్నాయని చెబితే-" నీళ్ళు నమిలింది వైదేహి.

"ఇట్స్ ఓకే.... మనం యింటికి వెళ్దామా?" అన్నాడు సుధాకర్, వైదేహి ముఖంలోకి చూసి.

సరే అన్నట్టు తలూపింది వైదేహి. పోర్టికో వైపు వెళ్తున్న సుధాకర్ వెంట ఆమె వెళ్ళింది.

వైదేహి తన పక్కన కూర్చోగానే కారుని ముందుకు పోనిచ్చాడు సుధాకర్.

"ఈ ఆశ్రమంలో ముద్దులొలికే చిన్నారులు ఎంతోమంది ఉన్నారు. మనకు నచ్చిన ఒక బాబుని దత్తత తీసుకోవాలని ఉంది. ఈ విషయం గురించి నీతో యింతకుముందు మాట్లాడాను... నీ ఉద్దేశంలో ఎవరైనా ఉన్నారా?" కారు నడుపుతూ అడిగాడు సుధాకర్.

ఈరోజు స్టేజి మీద ఎక్కువ బహుమతు లందుకున్న బాలు అని చెప్పాలనుకుంది వైదేహి. బాలు అని ప్రత్యేకించి అడుగుతున్నావ్?.... ఆ బాలు వివరాలు నీకు యింతకుముందే తెలుసా?- అని సుధాకర్ అడిగితే తను సమాధానం చెప్పగలదా?.... బాలుని కాకుండా అతను మరో బాబు పేరు సూచిస్తే.... వైదేహి నోరు విప్పలేకపోయింది.

"చూడు వైదేహి, తొందరేం లేదు - బాగా ఆలోచించి తర్వాత చెప్పు."

వేగాన్ని పెంచి కారుని తన బంగళా వైపు పోనిచ్చాడు సుధాకర్.

★ ★ ★

ఆదివారం ఉదయం పదిగంటలకు మంచి ముహూర్తం ఉందని చెప్పాడు పురోహితుడు. ఎవర్ని దత్తత తీసుకుంటే బాగుంటుందో ఆలోచించి చెప్పమని వైదేహికి చెప్పి ఒక వారం గడచింది. వైదేహి ఏ సంగతి చెప్పలేదు. ఆ రోజు ఆదివారం అన్న సంగతి గుర్తు తెచ్చుకుని హడావిడిగా బయల్దేరాడు సుధాకర్. వైదేహిని కూడా తనవెంట రమ్మన్నాడు. ఇద్దరు కార్లో కూర్చునేసరికి టైమ్ తొమ్మిది దాటింది. ఆశ్రమం చేరటానికి యింకో అరగంట పడుతుంది. కారుని స్టార్ట్ చేసి ఆశ్రమం వైపు పోనిచ్చాడు సుధాకర్.

"వైదేహి, ఎవర్ని దత్తత తీసుకుందాం అంటావ్?" స్టీరింగ్ పట్టుకుని అడిగాడు సుధాకర్.

కన్నకొడుకు ఉండగా ఎవరినో దత్తత తీసుకోవడమా?... మాతృప్రేమ అందుకు అంగీకరిస్తుందా?.... ఇప్పుడేం చేయాలి? దత్తత ప్రోగ్రామ్ వాయిదావేస్తే.... సుధాకర్ సమ్మతిస్తాడా? అతని మనసు బాధపడిపోదూ... ఎంత ఆలోచించినా సరైన సమాధానం వైదేహికి తట్టలేదు.

"మీ యిష్టం" అప్రయత్నంగా అంది వైదేహి, సుధాకర్ వైపు తిరిగి.

"వెరీగుడ్ వైదేహి- నువ్విలా అంటావని నాకు తెలుసు. అన్ని విషయాల్లోను నా సెలక్షనే బాగుందని అంటావ్. మరి దత్తత తీసుకుబోయే బాబు సెలక్షన్ కూడా నాకే విడిచిపెడతావని నేను ముందే ఊహించాను." నవ్వుతూ అన్నాడు సుధాకర్ స్టీరింగ్ తిప్పుతూ.

సుధాకర్ దృష్టిలో మరే బాబు అయినా ఉన్నాడేమో! ఇంటికి తీసుకురాబోయే ఆ బాబును తను సహృదయంతో పెంచగలదా?....

కారు ముందుకు సాగిపోతోంది. ఆశ్రమం దగ్గరపడుతున్న కొలది వైదేహి మనసులో కలవరం ఎక్కువ కాసాగింది.

అనుకున్న టైముకు వైదేహి, సుధాకర్ ఆశ్రమానికి చేరుకున్నారు. ఆ యిద్దరు కారు దిగి నేరుగా ఆశ్రమం లోపలికెళ్ళారు. వైదేహి హాల్లో కూర్చుంది. ఆమె మనస్సు మనసులో లేదు. సుధాకర్ హాస్టల్‌లోకెళ్ళి ఒక బాబుని ఎత్తుకుని వైదేహి దగ్గరకొచ్చాడు.

"ఇటు చూడు వైదేహి, బాబు ఎలా ఉన్నాడో!" హాల్లో నిలబడి అన్నాడు సుధాకర్. తల పైకెత్తి చూసిన వైదేహి తన కళ్ళను తనే నమ్మలేకపోయింది. సుధాకర్ ఎత్తుకుని ఉన్న బాలుని చూసి ఆనందం పట్టలేకపోయింది. అతని వెంట వచ్చిన శివరామయ్యను చూసి ఆమె లేచి నిలబడింది, రెండు చేతులు జోడించి నమస్కరించింది.

"చూడు వైదేహి - నువ్వు చాలా అదృష్టవంతురాలివి. బాలు నీ కొడుకన్న సంగతి సుధాకర్‌కు నువ్వు తెలియపర్చలేదు. అలాగే ఆ విషయం తనకు తెలిసినా తెలియనట్టే నీ దగ్గర నటించాడు సుధాకర్. నీ మనస్సును అతను, అతని మనస్సును నువ్వు బాధపెట్టకూడదన్న సదుద్దేశంతో మీరీ విషయాన్ని రహస్యంగా ఉంచారన్న సంగతి నాకు తెలుసు... బాలు కలయికతో మీ యిద్దరి మనసులు కుదుటపడ్డాయి. మీ ముగ్గురు ఆయురారోగ్యాలతో నూరేళ్ళు సుఖంగా జీవించాలని నేను మనసారా దీవిస్తున్నాను." ఆశీర్వదించిన శివరామయ్యకు మరోసారి నమస్కరించి వైదేహి, సుధాకర్, బాలును వెంటబెట్టుకుని బయటకు నడిచారు. ❃

## దొంగతో హనీమూన్!



ంటర్‌నెట్ ద్వారా కలుసుకొని 2 సంవత్సరాల పాటు గాఢంగా ప్రేమించుకొని ఈ మధ్య ఓ అందమైన జంట ఒక ఇంటి వారయ్యారు! వరుడు అమెరికాకు చెందిన రిచర్డ్ కోసిమర్. వధువు మెల్‌బౌర్న్‌లోని అనిత పెర్రీ. ఆమెకు అప్పటికే 5 గురు సంతానం ఉన్నారు. రిచర్డ్‌కు నేర చరిత్ర చాలా వుంది. అనేక నేరాలపై చాలా సార్లు ఊచలు లెక్కించాడు. కొకైన్ కలిగి ఉన్నందుకు, ఇళ్లల్లో దొంగతనాలు చేసినందుకు, దొంగసొత్తు కొన్నందుకు కేసులు నడుస్తున్నాయి. ఏదియేమైనా వారి హనీమూన్ హాయిగా గడిచింది.